రోడ్లపైనే పార్కింగ్

- ప్రధాన బస్టాండ్ వద్ద రాకపోకలకు ఇబ్బందులు
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు



నిజామాబాద్ ఆర్టీసీ బస్టాండ్ ఎదుట రోడ్డుపైన నిలిపి ఉంచిన ఆటోలు

ఖలీల్‌వాడి: నగరంలో అత్యంత రద్దీగా ఉండే నిజామాబాద్ బస్టాండ్ వద్ద రోడ్డుపై ఆటోలు నిలిపివేయడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. బస్టాండ్‌కు నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, జగిత్యాల జిల్లాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు వస్తుంటారు. అయితే రోడ్డుపైన ఆటోలు నిలిపివేయడంతో ట్రాఫిక్ జామవుతుంది. పాదచారులు బస్టాండ్ ప్రక్కన ఉన్న ఖలీల్‌వాడిలోని ఆసుపత్రులకు వెళ్లడానికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఆటోలను డైరెక్ట్‌గా బస్టాండ్‌లోకి తీసుకెళ్తున్నా ఆర్టీసీ అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ రోడ్డు గుండా వ్యవసాయ మార్కెట్, దేవిరోడ్డు, ప్రభుత్వ ఆసుపత్రి, గాజులపేట్‌కు వెళ్తుంటారు. ఈ ప్రాంతంలో వ్యాపార లావాదేవీలు అధికంగా ఉండటంతో వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. అంతేకాకుండా తోపుడు బండ్లపైన పండ్లు అమ్మే వారు రోడ్డుపైనే వాటిని పెట్టడంతో ఈ రోడ్డు గుండా వెళ్లడానికి వాహనదారులు ఇబ్బందులు పడ్డాల్సి వస్తోంది. రోడ్డుపైన తోపుడు బండ్లతోపాటు ఆటోలను తొలగించి రాకపోకలకు ఇబ్బందులు తొలిగించాలని ప్రయాణీకులు, నగరవాసులు కోరుతున్నారు.

ఆటోలను నియంత్రించాలి



వాహనాలపైన వెళ్లిన సమయంలో బస్టాండ్ వద్ద రోడ్లపైన ఆటోలు నిలిపి ఉంచటంతో పలుమార్లు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. వీటిని రోడ్లపైన పోలీసులు తొలగించి ట్రాఫిక్ సమస్యను తీర్చాలి. ఆస్పత్రులకు వెళ్లేవారికి చాలా ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

– బొద్దుల దేవేందర్, గాయత్రి నగర్, నిజామాబాద్

అన్ని వర్గాలను మోసం చేసేలా బడ్జెట్

- బీజేపీ పూర్తిగా వ్యతిరేకిస్తోంది..
- పార్టీ ఫ్లోర్ లీడర్ గోపిడి స్రవంతిరెడ్డి



మాట్లాడుతున్న బీజేపీ ఫ్లోర్ లీడర్ స్రవంతిరెడ్డి

సుభాష్‌నగర్: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్నివర్గాల ప్రజలను మోసం చేసే విధంగా ఉందని బీజేపీ ఫ్లోర్ లీడర్ గోపిడి స్రవంతిరెడ్డి విమర్శించారు. గురువారం నగర బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. తమ ప్రమేయం లేకుండానే బడ్జెట్ ప్రవేశపెట్టారని, గాలిలో మేడలు కట్టినట్లు లెక్కలు చూపిస్తున్నారని ఆరోపించారు. రూ.కోట్లు వెచ్చించి అభివృద్ధి చేపట్టామని నాయకులు ప్రకటనలిస్తున్నారని, ఎక్కడ అభివృద్ధి జరిగిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే గణేష్ గుప్తా రాసిన బడ్జెట్ పత్రాలను చదివి విన్పించడం సిగ్గుచేటని, వెంటనే మేయర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ కార్పొరేటర్లను కొనడంపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేదని ఆరోపించారు. బడ్జెట్ సమావేశంలో మాట్లాడే అవకాశమివ్వకుండా అధికార పార్టీ నాయకులు అడ్డుపడ్డారని, దీనికి నైతిక బాధ్యత ఎమ్మెల్యే, మేయర్ వహించాలన్నారు. ఒక వర్గం ప్రజల కోసం రూ.కోట్లు కేటాయించారని, ఇది నగర ప్రజలను మోసం చేయడమేనన్నారు. సమావేశంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పంచరెడ్డి లింగం, కార్పొరేటర్లు పంచరెడ్డి ప్రవళిక శ్రీధర్, ఇప్పకాయల సుమిత్ర కిషోర్‌క్, మాస్టర్ శంకర్, ఇల్లెందుల మమత, చందుపట్ల వనిత శ్రీనివాస్, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహనం వద్ద సీపీ కేఆర్ నాగరాజు

నిజామాబాద్ సిటీ: ద్విచక్ర వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలను నడపవద్దని పోలీస్ కమిషనర్ కేఆర్ నాగరాజు సూచించారు. గురువారం ఆర్మూర్ రోడ్డు వైస్రాయ్ గార్డెన్‌లో సాయి ఎస్ఆర్‌కే హోండా షోరూం నూతన ద్విచక్ర వాహనం యాక్టివా హెచ్ స్మార్ట్‌ను ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ శ్రీకాంత్‌తో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. యాక్టివా హెచ్ స్మార్ట్ కాలానికి అనుగుణంగా మంచి సౌకర్యాలతో రూపొందించారని, ఇద్దరు సౌకర్యంగా కూర్చునే విధంగా తయారు చేయటం బాగుందన్నారు. అనంతరం షోరూం యజమాని కట్టా శ్రీకాంత్ మాట్లాడుతూ.. యాక్టివా హెచ్ స్మార్ట్ ధర రూ 82,138 ఉందని, లీటర్‌కు 55 కిలోమీటరు మైలేజ్ ఇస్తుందని, వాహనం చోరీకి గురైతే అది ఎక్కడ ఉందో గుర్తించే టెక్నాలజీ దీనిలో ఉందని తెలిపారు. బ్యాంక్ మేనేజర్ పెరుమాళ్లు, షోరూం యజమాని కట్టా సుదర్శన్‌రెడ్డి, కంపనీ మేనేజర్ సాగర్ పాల్గొన్నారు.

సేవా సమితి కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు వీరే

నిజామాబాద్‌నాగారం: శ్రీ లక్ష్మి చేయూత సేవా సమితి నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వంగల రమణాచారి, కోశాధికారిగా చిలుముల భూషణ్ చారి, ప్రధాన కార్యదర్శిగా అలువాల లక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా చెన్నోజీ బాలరాజ్, మడుపు సదానంద్, సంయుక్త కార్యదర్శులుగా మగ్గిడి వేణుగోపాల్‌రావు, చిటికెశి రవీందర్, సలహాదారులుగా మరోజు వసంతరాజు, కోడిచేర మల్లికార్జున్, ధీరజ్ అగర్వాల్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా గన్నారం పూర్ణ చందర్, కార్యనిర్వాహక సభ్యులుగా తాటి శ్యామ్ కుమార్, బంగారి శ్రీనివాస్, తదితరులు ఎన్నికయ్యారు.

విలువలకు కట్టుబడిన వ్యక్తి కుటుంబ రావు

ఖలీల్‌వాడి: సీపీఎం నేత పరుచూరి కుటుంబరావు కమ్యూనిస్టు విలువలకు కట్టుబడి ఉన్న వ్యక్తి అని వివిధ రాజకీయపార్టీల నేతలు కొనియాడారు. నగరంలోని మాధవ్‌నగర్‌లో సంతాప సమావేశాన్ని నిర్వహించారు. సీపీఎం, సీపీఐ, న్యూడెమోక్రసీ, ప్రజాపంథా, కాంగ్రెస్, బీఆర్ఎస్, తదితర పార్టీలకు చెందిన నాయకులతో పాటు మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర్‌రావు పార్థివ దేహనికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సంతాప సమావేశానికి న్యాయవాది గొర్రెపాటి మాధవ రావు అధ్యక్షత వహించారు. అనంతరం ఆయన పార్థివ దేహాన్ని కుటుంబ సభ్యుల సమక్షంలో మెడికల్ కాలేజీకి తీసుకెళ్లి అక్కడి విద్యార్థుల అవసరాల కొరకు పార్థివ దేహాన్ని అప్పగించారు.

కోరం లేకుండానే సర్వసభ్య సమావేశం

- మండల అధికారి తీరుపై ఎంపీటీసీల ఆగ్రహం



మాట్లాడుతున్న ఎంపీపీ బానోత్ అనూష

నిజామాబాద్ సిటీ: అందరి ఆమోదం మేరకు జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం కోరం సభ్యులు లేకుండానే పూర్తికానిచ్చారు. కోరం లేకుండా సర్వసభ్య సమావేశం నిర్వహించటంపై పలువురు ఎంపీటీసీలు, అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల అభివృద్ధిపై సమావేశంలో చర్చించాల్సిన అంశాలు ఎన్నో ఉంటాయని, ఈ సమావేశానికి ఎంపీటీసీలు వివిధ కారణాలతో హాజరుకాకుంటే సమావేశాన్ని మరోసారి జరపాలి అంతేగాని ఎంపీటీసీలు లేకుండా సమావేశం నిర్వహించటంపై ఎంపీపీ, అధికారుల తీరును తప్పుపట్టారు. గురువారం నిజామాబాద్ రూరల్ మండల సర్వసభ్య సమావేశం జిల్లా పరిషత్ సమావేశం మందిరంలో జరిగింది. సమావేశం ఉదయం 11 గంటలకు మొదలు కావాల్సి ఉండగా, మధ్యాహ్నం 12.10 గంటలకు మొదలైంది. అప్పటికి అధికారులు , ఎంపీపీ, వైస్ ఎంపీపీ, కో ఆప్షన్ సభ్యులు మాత్రమే హాజరయ్యారు. ఆరుగురు ఎంపీటీసీలు సమావేశానికి గైర్హాజరయ్యారు. సమావేశం జరుగాలంటే నలుగురు సభ్యులుండాలి. కాని కో–ఆప్షన్ సభ్యుడిని పరిగణనలోకి తీసుకుని కోరం ఉందని సమావేశం నిర్వహించటంపై మిగతా ఎంపీటీసీలు అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశానికి 10 మంది సర్పంచ్‌లు హాజరై వారి గ్రామాలలో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గుండారం, గాంధీనగర్‌లో కుక్కల బెడద తీవ్రంగా ఉందని సర్పంచ్‌లు లక్ష్మణ్‌రావు, అనూషాలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

కోరం ఉన్నందునే సమావేశం పెట్టాం: ఎంపీపీ

మండల సర్వసభ్య సమావేశానికి నాతోపాటు, వైస్ ఎంపీపీ అన్నం సాయిలు, మల్కాపూర్ ఎంపీటీసీ శాంతాబాయి, కో–ఆప్షన్ సభ్యులు హాజయ్యారని, కోరం ఉండటంతోనే సమావేశాన్ని నిర్వహించినట్లు ఎంపీపీ బానోత్ అనూషా తెలిపారు. సమావేశం గురించి నెలరోజుల ముందే ఎంపీటీసీలకు సమాచారం ఇచ్చామని, ఇప్పుడు సమావేశానికి రాకుండా ఏదో కారణాలు చెప్పటం సరైనది కాదన్నారు.

సీనియర్ విద్యార్థులపై చర్యలు తీసుకోవాలి

నిజామాబాద్‌అర్బన్: వరంగల్‌లో వైద్య విద్యార్థి ఆత్మహత్య ఘటనలో సీనియర్ విద్యార్థులు, అధికారులపై చర్యలు తీసుకోవాలని లంబాడీ స్టూడెంట్ ఆర్గనైజేషన్ జిల్లా కార్యదర్శి జాదవ్ సాయి డిమాండ్ చేశారు. గురువారం నగరంలో సాయి మాట్లాడుతూ..మెడికల్ కళాశాలలో జరిగిన ఘటన చాలా దురదృష్టకరమన్నారు. ఒక గిరిజన లంబాడి సామాజిక వర్గానికి చెందిన ధారావత్ ప్రీతి ఎంతో కష్టపడి ఎంబీబీఎస్ డిగ్రీ పూర్తి చేసి పీజీ మొదటి సంవత్సరం చదువుతున్న సమయంలో కొందరు డాక్టర్లు, ప్రొఫెసర్లు, సీనియర్ విద్యార్థులు సంబంధిత ప్రిన్సిపాల్ ఆమెని మానసికంగా హింసించి ఇబ్బంది పెట్టారని ఆరోపించారు. ఆ కారణంతోనే ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని అన్నారు. బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకొని, ప్రిన్సిపాల్‌ని వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

మూగ, చెవిటి పాఠశాలలో అన్నదానం

నిజామాబాద్‌నాగారం: ధర్మపురి సురేందర్ జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం నగరంలోని మూగ, చెవిటి పాఠశాలలో గురువారం అన్నదానం చేశారు. ధర్మపురి సురేందర్ పిల్లల మధ్య కేక్ కట్ చేసి పిల్లలకు భోజనం వడ్డించి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ధాత్రిక రమేష్, శ్రీహరి శర్మ, బంటు రాము, ఖయ్యూం, అజార్ భాయ్, సాకేత్, నారాయణ పాల్గొన్నారు.

జిమ్నాస్టిక్ క్రీడల అభివృద్ధికి పాటుపడతా

- ఎంపీ ధర్మపురి అర్వింద్



వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

నిజామాబాద్‌నాగారం: జిల్లాలో జిమ్నాస్టిక్ క్రీడల అభివృద్ధికి పాటుపడుతానని, అవసరమైన సామగ్రి ఏర్పాటుకు కృషి చేస్తానని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ అన్నారు. గురువారం నగరంలో జిల్లా జిమ్నాస్టిక్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ఎంపీని కలిసి విన్నవించారు. జిల్లాలో జిమ్నాస్టిక్ క్రీడా సంబంధించినటువంటి పలు అంశాలను చర్చించారు. జిల్లాలో జిమ్నాస్టిక్ అకాడమీ ఏర్పాటు చేయాలని కోరారు. ఎంపీ సానుకూలంగా స్పందించి త్వరలో జిల్లా జిమ్నాస్టిక్ అసోసియేషన్‌కి క్రీడా సామాగ్రిని అందజేస్తానని తెలిపారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సాయగౌడ్, కార్యదర్శి సుబ్బారావు, లింగన్న, విద్యాసాగర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జీవాలకు నట్టల నివారణ మందులు



సిరికొండ: మండలంలోని హుస్సేన్‌నగర్, తాళ్లరామడుగు గ్రామాల్లో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను వేసినట్లు మండల పశుసంవర్ధక శాఖ అధికారి బాబురావు తెలిపారు. 1921 గొర్రెలు, 164 మేకలకు మందులు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీ, ఎంపీటీసీ గోవర్ధన్, సిబ్బంది చంద్రశేఖర్, సతీష్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

బంద్‌తో నిలిచిన పసుపు కొనుగోళ్లు



మార్కెట్ యార్డులో నింపిన పసుపు బస్తాలు

ఇందూరు(నిజామాబాద్ అర్బన్): ఆదాయ పన్ను శాఖ తమపై పన్ను విధించడాన్ని నిరసిస్తూ జిల్లా మర్చంట్ అసోసియేషన్ ఇచ్చిన బంద్ కారణంగా నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో గురువారం కొనుగోళ్లు నిలిచిపోయాయి. ఒక రోజు ముందుగానే మార్కెట్ అధికారులు పసుపు కొనుగోళ్లు పూర్తి చేయించారు. బుధవారం రాత్రి 11 గంటల వరకు కూడా తూకం వేశారు. అయితే గురువారం ఎలాంటి పంట క్రయ, విక్రయాలు జరగలేదు. కమీషన్ ఏజెంట్ల నిరసనతో మార్కెట్‌లో కార్యకలాపాలు నిలిచిపోయాయి. ఎక్కడ చూసినా పసుపు నింపిన బస్తాలే కనిపించాయి. శుక్రవారం యథావిధిగా పసుపు కొనుగోళ్లు జరుగనున్నాయి.

27న మెగా జాబ్ మేళా

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో 27న ఎంఎస్ఎన్ లాబరేటరీలో ఉద్యోగ ఖాళీలను భర్తీచేయడానికి మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ప్లేస్మెంట్ ఆఫీసర్ రవీంద్రరావు, ప్రిన్సిపల్ వెంకట్‌రెడ్డి గురువారం తెలిపారు. అర్హత ఏదైన డిగ్రీ పాస్, వయస్సు 30 లోపు ఉండాలి. అర్హత సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, బయోడేటా ఫారంతో రావాలన్నారు. వివరాలకు 9014588023, 9014918827 సంప్రదించాలన్నారు.

మల్లన్న స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



పూజలు చేస్తున్న యాదవ కులస్తులు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): ముదక్‌పల్లిలో శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో మల్లన్నస్వామి, ఎల్లమ్మ విగ్రహాలను గురువారం ప్రతిష్ఠించారు. వేదమంత్రోచ్చరణాల మధ్య మల్లన్న స్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. విగ్రహాల ప్రతిష్ఠాపనతోపాటు యజ్ఞం, ధ్వజస్తంభం ఏర్పాటుచేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.

వైభవ వేంకటేశ్వర బ్రహ్మోత్సవాలు

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం ఆకుల కొండూర్ గ్రామ పంచాయతీ పరిధి అశోక్‌ఫారంలో వైభవ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. గురువారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల కార్యక్రమంలో భాగంగా నేడు(శుక్రవారం) లక్ష్మీనారాయణ హృదయ హవనము జరుగనుంది.

అటవీశాఖ కార్యాలయం ప్రారంభం



ధర్పల్లిలో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, ఎంపీపీ సారికారెడ్డి

ధర్పల్లి: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన అటవీ శాఖ కార్యాలయాన్ని జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, ఎంపీపీ సారిక హనుమంత్ రెడ్డితో కలిసి గురువారం ప్రారంభించారు. భవన నిర్మాణానికి కంపా నిధుల నుంచి రూ.27 లక్షలు ఇచ్చిన సీఎం కేసీఆర్, అటవీ శాఖ అధికారులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ధర్పల్లిలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నెలకొల్పిన రామారావు మహారాజ్ విగ్రహ మూడవ వార్షికోత్సవంలో పాల్గొన్నారు. విగ్రహం వద్ద బోగ్ బండార్ నిర్వహించి ప్రత్యేక పూజలు చేపట్టారు. సర్పంచ్ ఆర్మూర్ బాలరాజ్, నాయకులు హనుమంతు రెడ్డి, ధరావత్ గోపాల్, చిన్నారెడ్డి, సురేందర్ పాల్గొన్నారు.

పోడుదారులకు పట్టాలు ఇవ్వాలి



సిరికొండ: పోడు భూములు సాగు చేసుకుంటున్న వారికి వెంటనే పట్టాలు ఇవ్వాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి దాసు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 2022 అటవీ సంరక్షణ నియమాలను ఉపసంహరించుకోవాలని కోరారు. సిరికొండలోని సర్వే నెంబర్ 532, గడ్కోల్‌లో 100, 102, మెంట్రాజ్‌పల్లిలో 246 సర్వే నెంబర్లలో కబ్జాలో ఉన్న రైతులకు తెలంగాణ కొత్త పట్టా పాసుపుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రోటరీ క్లబ్ ఆవిర్భావ దినోత్సవం

నిజామాబాద్ సిటీ: రోటరీ క్లబ్ 118వ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం రోటరీ సభ్యులు ఘనంగా జరుపుకున్నారు. క్లబ్ అధ్యక్షుడు సతీష్ సాహు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ విశాల్ మాట్లాడుతూ.. రోటరీ క్లబ్ పోలియో నిర్మూలనలో కీలక పాత్ర పోషించిందని, తదుపరి లక్ష్యంగా సంపూర్ణ అక్షరాస్యత సాధించే దిశలో పయనిస్తుందన్నారు. కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి డాక్టర్ హరిస్వామి, సభ్యులు రాజేందర్, పార్సి రాజేశ్వర్, ఆకుల అశోక్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులకు అభినందనలు



మోపాల్(నిజామాబాద్‌రూరల్): ఇటీవల నిర్వహించిన జాతీయస్థాయి క్రీడాపోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మండల కేంద్ర శివారులోని ప్రెసిడెన్సీ పాఠశాలకు చెందిన విద్యార్థులను చైర్మన్ నల్ల శమంతరెడ్డి, ప్రిన్సిపాల్ పవన్ కుమార్ గురువారం అభినందించారు. పోటీల్లో పతకాలు సాధించి పాఠశాల పేరును ఉన్నత స్థాయిలో నిలబెట్టారని వారు పేర్కొన్నారు. జాతీయస్థాయి ఇంటర్ డిస్ట్రిక్ అథ్లెటిక్స్‌లో సాత్విక్, తైక్వాండోలో శ్రీనిజ, క్రికెట్‌లో సామిత్, వెంకట్ అనీష్, క్రాంతి, యయతి, జశ్వంత్, రక్షిత్, ప్రేమ్‌సాయి, అభినవ్, రిద్ధిమాన్, యోగాలో శ్రీహిత, సాయి రుద్రిక విజేతలుగా నిలిచారని తెలిపారు. విద్యార్థులను క్రీడల్లో తీర్చిదిద్దిన వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాస్, లక్ష్మణ్, విజేశ్, శివ, సరళ, రాధాలను కూడా అభినందించారు.

జైహింద్ క్రాంతి సేవా మిషన్ అధ్యక్షుడిగా శ్రీహరి



నిజామాబాద్‌నాగారం: జైహింద్ క్రాంతి సేవా మిషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీహరి పన్నంవార్ నియమితులయ్యారు. ఈ మేరకు నియామకపత్రాన్ని జాతీయ అధ్యక్షుడు మీనా అందజేశారు. సంస్థ కోసం పూర్తి నిష్ఠతో నిస్వార్థంగా పని చేస్తానని శ్రీహరి తెలిపారు.

'బస్వా'కు సన్మానం



సుభాష్‌నగర్: జాతీయ స్థాయి తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీల్లో కాంస్య పతకం సాధించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్యను గురువారం హైదరాబాద్‌లో జాతీయ, రాష్ట్ర నాయకులు ఘనంగా సన్మానించారు. ఇటీవల పాండిచ్చేరిలోని రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ పోటీల్లో 65 ఏళ్ల పైబడిన కేటగిరీ విభాగంలో రాష్ట్రానికి మొదటిసారిగా కాంస్య పతకం వచ్చిన విషయం తెలిసిందే. బస్వా లక్ష్మీనర్సయ్యకు అభినందనలు తెలియజేసి సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఇన్‌ఛార్జులు తరుణ్ చుగ్, సునీల్ బన్సాల్, సహ ఇన్‌ఛార్జి అరవింద్ మినాస్, రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్, సీనియర్ నాయకులు మురళీధర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

జాదూ రంగనాథ్‌కు..



నిజామాబాద్‌నాగారం: ప్రపంచ ఇంద్రజాలికుల దినోత్సవం పురస్కరించుకుని గురువారం నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తాను ఘనంగా శాలువాతో సన్మానించారు. రంగనాథ్ సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో నగర మేయర్ నీతూకిరణ్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ధర్మపురి సురేందర్‌కు..

నిజామాబాద్‌నాగారం: మెట్టు కుమ్మర్‌గల్లి మున్నూరు కాపు సంఘ సభ్యులు ధర్మపురి సురేందర్ జన్మదినం పురస్కరించుకొని గురువారం శాలువా, బొకేలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు బంటు బలరాం, జీలకర లక్ష్మణ్, బంటు రామ్ కుమార్, బంటు ప్రవీణ్, బంటు రామ్ రాజ్, ప్రశాంత్, గోపు శేఖర్ పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడికి సత్కారం

నిజామాబాద్‌నాగారం: ఢిల్లీలో జరిగిన ప్లీనరీలో ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షులు సంజీవరెడ్డిని జిల్లాకు చెందిన 327యూనియన్ రీజినల్ కార్యదర్శి పూదరి గంగాధర్ ఆధ్వర్యంలో గురువారం సత్కరించారు. జనరల్ కౌన్సిల్‌లో ఆల్ ఇండియా ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షులు సంజీవరెడ్డి మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా ప్రత్యేకంగా సన్మానించి సత్కారించారు. కార్యక్రమంలో 327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ శ్రీధర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేష్ పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

నిజామాబాద్‌అర్బన్: టూ వీలర్ మెకానిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం తోటి మెకానిక్‌కు ఆర్థిక సహాయం అందించారు. మెకానిక్ ఆకుల శేఖర్ బండిపై వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఆయన ఆర్థిక పరిస్థితి తెలుసుకొని టూవిలర్ మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేష్ తన సభ్యులతో కలిసి ఆకుల శేఖర్ కుటుంబానికి రూ.3 వేల ఆర్థిక సహాయం అందించారు. బట్టి గిరి, ఆనంద్, నూరుద్దీన్, రాజేష్ ఉన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	57,200	వెండి (కిలో)	69,500
22 క్యారెట్స్	52,725		

– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	14	25	క్యాప్సికం	35	50
బెండకాయ	50	70	గాజరుగడ్డ	20	40
బీరకాయ	50	70	పచ్చిమిర్చి	20	40
దొండకాయ	25	40	దోసకాయ	15	30
బీర్నీసుకాయ	35	50	ఆలుగడ్డ	20	40
కాకరకాయ	40	60	గోబిగడ్డ	8	15
వంకాయ	10	20	గోబిపువ్వు	12	25
పాలకూర	10	20	బీట్‌రూట్	15	30
మెంతికూర	20	40	గోరు చిక్కుడు	70	90
కొత్తిమీర	10	20	చిక్కుడుకాయ	30	50
పుదీనా	30	50			

– ఇందూరు

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)		
		డ్రెస్డ్	220
		లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	750

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్–1– సార్– 10.30,1.30,4.30,7.30 10.20

స్క్రీన్–2– వినరో భాగ్యము విష్ణుకథ–10.50
యాంటీ–మేన్ అండ్ ది వాస్ (ఇంగ్లీష్)–1.40,10.30
షెహజాదా(హిందీ)–4.40,7.40

స్క్రీన్–3– వినరో భాగ్యము విష్ణు కథ–1.30, 7.40,10.30
యాంటీ–మేన్ అండ్ ది వాస్(ఇంగ్లీష్) –4.40

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్–1– యాంటి–మేన్ అండ్ ది వాస్ (ఇంగ్లీష్) –10.50,4.50,7.40 ,10.30
యాంటీ–మేన్ అండ్ ది వాస్(తెలుగు) –1.40

స్క్రీన్–2 – సార్ –10.20,4.00,7.00,10.00
రైటర్ పద్మభూషన్–1.20

స్క్రీన్–3– షెహజాదా(హిందీ)–10.00,4.10 7.20,10.30 – సార్ –1.10

స్క్రీన్–4– వినరో భాగ్యము విష్ణు కథ –10.15 4.30,10.45
– పఠాన్ –హిందీ–1.15 7.30

దేవి	సార్
నటరాజ్	యాంట్–మేన్ అండ్ ది వాస్ప్
లలితామహల్	వాల్తేరు వీరయ్య
శ్రీదేవి	ధమాకా
విజయ్	వినరో భాగ్యము విష్ణు కథ